క్లుప్తంగా

నేటి సమాచారం..

కేఎంసీ కౌన్సిల్ సమావేశం

ఖమ్మంమయూరిసెంటర్: మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశాలతో కేఎంసీ కౌన్సిల్ సమావేశాన్ని బుధవారం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో 16 అంశాలతో కూడిన అజెండాను అధికారులు ప్రవేశ పెట్టనున్నారు. వీటిలో ప్రధానంగా ఔట్‌సోర్సింగ్ వర్కర్ల వేతనాలు చెల్లింపులతో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది వేతనాలు, స్టాండింగ్ కౌన్సిల్ సిబ్బంది వేతనాలు, నలుగురు టెక్నికల్ అసిస్టెంట్ల వేతనాలు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వేతనం, రిటైర్డ్ తహసీల్దార్ వేతనం చెల్లింపులకు సంబంధించిన అంశాలను అజెండాలో చేర్చారు. అంతేకాక టౌన్ ప్లానింగ్‌కు, రెవెన్యూ విభాగాలకు సంబంధించి అంశాలతో పాటు ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 454 అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు, ఎస్‌డీఎఫ్ నిధులకు సంబంధించిన 79 పనులకు బిల్లుల చెల్లింపు, ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధుల నుంచి చేపట్టిన 16 పనుల సమాచారం నిమిత్తం, 179 అభివృద్ధి పనులకు సంబంధించిన ఈఎండీ, ఎఫ్ఎస్‌డీ చెల్లింపులకు సంబంధించిన అంశాలను అజెండాలో పొందుపరిచి కాపీలను అధికారులు, కార్పొరేటర్లకు అందజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని బురహాన్‌పురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8గంటన నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ బి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు మామిళ్లగూడెం, బురహాన్‌పురం, మయూరిసెంటర్, రేవతి సెంటర్, వైరారోడ్, సరిత క్లినిక్ సెంటర్, బస్ డిపో ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

కేఎంసీ ముచ్చట్లు..

చెత్త సేకరణపై అవగాహన

ఖమ్మంమయూరిసెంటర్: చెత్త సేకరణపై శానిటేషన్ సిబ్బంది మంగళవారం 26వ డివిజన్‌లో అవగాహన కల్పించారు. మహిళ సంఘాల సభ్యులతో ఇంటింటి ప్రచారం చేయించేలా కేఎంసీ అధికారులు ప్రణాళిక చేయగా.. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు.

హైవేపై మార్కింగ్..

ఖమ్మం నగరం మీదుగా వెళ్తున్న వరంగల్ – రాజమండ్రి జాతీయ రహదారిపై ఆక్రమణలను గుర్తించేందుకు కేఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నగరంలోని రాపర్తినగర్ నుంచి శ్రీశ్రీ సర్కిల్ వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు మార్కింగ్‌లు చేశారు. బుధవారం రోడ్లను, డ్రెయిన్లను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను తొలగించనున్నారు.

పార్కులకు మహర్దశ..



ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో వాకింగ్ ట్రాక్ కోసం పోసిన మట్టి



పూర్తయిన ప్రహరీ నిర్మాణం

అభివృద్ధి దిశగా గోళ్లపాడు చానల్

- పార్కుల్లో వాకింగ్ ట్రాక్స్, సైడ్‌వాల్స్ నిర్మాణ పనులు ప్రారంభం
- వాకర్ల అభ్యర్థన మేరకు కదిలిన మున్సిపల్ యంత్రాంగం
- తీరనున్న స్థానికుల కష్టాలు



యోగా శిక్షణకు నిర్మిస్తున్న కట్టడం

ఖమ్మంక్రైం: నగరంలోని త్రీటౌన్ పరిధి గోళ్లపాడు చానల్‌పై నిర్మించిన పంపింగ్‌వెల్ రోడ్డు, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్‌లోని పార్కులకు మహర్దశ పట్టింది. ఒకప్పుడు మురికివాడలగా విలసిల్లిన ఈ ప్రాంతాల్లో గోళ్లపాడు చానల్ తీసేసి పార్కుల నిర్మాణం చేపట్టారు. దీంతో ఈ ప్రాంతం అంతా కొంతమేర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది.

మొదలైన నిర్మాణ పనులు..

పంపింగ్‌వెల్ రోడు, సుందరయ్యనగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలను కలుపుతూ ఏర్పాటు చేసిన కాళోజీ పార్కు, మంచికంటిరామకిషన్‌రావు, సుందరయ్యనగర్, ప్రొఫెసర్ జయశంకర్ పార్కులుగా పేర్లు పెట్టి తయారు చేశారు. వీటిల్లో స్థానిక ప్రజలే కాక ఇతర ప్రాంతాలకు చెందిన వారు సైతం వాకింగ్, ఓపెన్ జిమ్‌ల కోసం వస్తున్నారు. అయితే వాకింగ్ ట్రాక్ రాళ్లు తేలి నడిచేందుకు ఇబ్బందిగా మారగా.. వర్షం వస్తే బురదమయంగా ఉంటుంది. ఈ విషయం కార్పొరేషన్ అధికారులు దృష్టికి వెళ్లడంతో పార్కుల్లో వాకింగ్ ట్రాక్, ప్రహరీల నిర్మాణంతో పాటు యోగ మండపం సైతం తయారు చేశారు.

ఆనందంగా ఉంది..

పార్కుల్లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉంది. రాళ్లుతేలి నడవలేని పరిస్థితి ఉండడంతో పాటు వర్షం వస్తే బురదమయంగా మరుతోంది. ఇప్పుడు ఆ బాధలు తీరనుండగా.. సైడ్ వాల్ నిర్మాణంతో రక్షణగా ఉంటుంది. – భాస్కర్, వాకర్

ఇబ్బంది పడేవాళ్లం..

పార్కులోని వాకింగ్ ట్రాక్‌లో ఎక్కువగా రక్త ప్రసరణ కోసం కాళ్లకు బూట్లు, చెప్పులు లేకుండా నడుస్తుంటారు. ఈ సమయాన వాకింగ్ ట్రాకింగ్‌పై రాళ్లు గుచ్చుకుని గాయాలయ్యేవి. ఇప్పుడు ఆ బాధ తీర్చడం అభినందనీయం. – కోటయ్య, వాకర్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం..

ఖమ్మం అర్బన్: రాష్ట్రం ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు సాగుతుందని, ప్రజల భాగస్వామ్యంతో ఖమ్మం నగరాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం ఎస్సీ కాలనీలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు, వెటర్నరీ ఆస్పత్రి రోడ్డులో రూ.25 లక్షలతో నిర్మించనున్న సీసీ, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాక ఆయన మాట్లాడారు. పనుల నిర్వహణలో నాణ్యత పాటించాలని, నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్లు రావూరి కరుణా సైదబాబు, కమర్తపు మురళి, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు మిక్కిలినేని నరేంద్ర, సంక్రాంతి నాగేశ్వరరావు, బాబు పాల్గొన్నారు.

మంత్రికి వినతి..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెం ప్రాంతంలో సర్వే నంబర్ 408లో ఆక్రమణల గురైన శ్మశానవాటికను కాపాడి, మౌలిక వసతులు కల్పించాలంటూ సీపీఐ కొత్తగూడెం శాఖ ఆధ్వర్యాన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మంత్రి ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని కొత్తగూడెంలో పర్యటించిన సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పగడాల మల్లేష్ నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. అల్లిపురం క్రాస్‌రోడ్‌లోని నివాసులకు ఇంటి నంబర్లు ఇవ్వాలని, కొత్తగూడెం–అల్లిపురం రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని, కొత్తగా నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మిశెట్టి రామనాథం, రావుల హన్మంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, బుడిగె వెంకటరమణ, నాగులపల్లి రంగారావు, మాకనబోయిన నాగేశ్వరరావు, బుడిగె వెంకన్న, ముద్రబోయిన అప్పారావు, పి.రామారావు, బంధం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మార్కెట్ రహదారుల పరిశీలన



పరిసరాలపై చర్చిస్తున్న కేఎంసీ బృందం, మార్కెట్ కమిటీ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం మిర్చి మోడల్ మార్కెట్‌ను రూ.155.30 కోట్లతో నిర్మిస్తుండగా.. మంగళవారం మార్కెట్ పరిసరాల స్థితి, అభివృద్ధిని నగర మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార, కమిషనర్ అభిషేక్ అగస్త్యలతో కూడిన బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్‌లు రహదార్ల అభివృద్ధిపై చర్చించారు. ప్రణాళికతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు.

దాశరథిని స్ఫూర్తిగా తీసుకోవాలి



ట్యాంక్‌బండ్‌పై దాశరథి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: ప్రజల పక్షాన నిలిచిన ప్రజాకవి దాశరథిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు ఆనందాచారి సూచించారు. దాశరథి శతజయంతి సందర్భంగా తెలంగాణ సాహితి అకాడమీ సౌజన్యంతో ఖమ్మం ఈస్తటిక్స్ ఆధ్వర్యాన మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో నీరాజనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనందాచారి మాట్లాడగా కవి, విద్యావేత్త రవిమారుత్, డాక్టర్ రమేష్ మాట్లాడారు. అలాగే, కేంద్ర సాహిత్య అకాడమి సభ్యులు ప్రసేన్ అధ్యక్షతన జరిగిన మరో సమావేశంలో పోతగాని సత్యనారాయణ, యనగందుల దేవయ్య, వంశీకృష్ణ, సుభాషిణి, కన్నెగంటి వెంకటయ్య, ఐ.వీ.రమణారావు, కేఎస్.రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడగా.. కవి సీతారాం విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించారు. అంతేకాక లకారం ట్యాంక్‌బండ్‌పై దాశరథి కృష్ణమాచార్యుల విగ్రహం వద్ద పలువురు నివాళులర్పించారు. మువ్వా శ్రీనివాసరావు, అట్లూరి వెంకటరమణ, పగడిపల్లి, బాగం హేమంతరావు, వెంకటయ్య, కోంద్రు బ్రహ్మం, నయింపాషా, గద్దపాటి శ్రీనివాస రావు, పేరెల్లి శ్రీను, శ్రీనివాస్ యాదవ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

ఖమ్మంసహకారనగర్: దాశరథి శత జయంతి దినోత్సవం సందర్భంగా తెలుగు విభాగం ఆధ్వర్యాన మంగళవారం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహ్మద్ జాకీరుల్లా, అధ్యాపకులు డా.పి.రవికుమార్, డాక్టర్ జె.అనురాధ, కోటమ్మ, డాక్టర్ కార్తీక్,డాక్టర్ ఎం.వి.రమణ,డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

రఘునాథపాలెం: మండలంలోని రేగులచెలకలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు కాంగ్రెస్ నాయకుడు, మాజీ గ్రామ ఉపసర్పంచ్ యండపల్లి సత్యం మంగళవారం శంకుస్థాపన చేసి ప్రారంభించారు.

అభివృద్ధి ఓర్వలేకే విమర్శలు..

కామేపల్లి: అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం మండలంలోని ఊట్కూర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి, రూ.16 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు చేస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రేషన్‌కార్డుల పంపిణీ జరిగిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ, రైతుల సంక్షేమ కమిషన్ డైరెక్టర్ రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హన్మంతరావు, మేకల మల్లిబాబుయాదవ్, ఏపూరి మహేందర్, మద్దినేని రమేశ్‌బాబు, నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, ఆరెం రవి, తోటకూరి శివయ్య, ధరావత్ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఎరువుల దుకాణాల తనిఖీ

కూసుమంచి/నేలకొండపల్లి: మండలంలోని పాలేరు, నర్సింహులగూడెం, చౌటపల్లి, జీళ్లచెరువు గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను మంగళవారం ఏఓ వాణి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి ఎరువుల నిల్వలను లెక్కించారు. అదేవిధంగా నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాలు, సొసైటీలు, ఎరువుల దుకాణాలను మంగళవారం కూసుమంచి ఏడీఏ సతీష్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎరువుల ధరల పట్టికతో పాటు నిల్వ వివరాలను బోర్డుపై ప్రదర్శించాలన్నారు. ఎరువులను పీఏఎస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయించాలని, ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏడీఏ సతీష్‌ను ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ అసోసియేషన్ బాధ్యులు సన్మానించారు. నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఏఈఓలు, డీలర్లు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గెల్లా వెంకటేశ్వరరావు, రామారావు, రామ లక్ష్మడు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ..

ఖమ్మం అర్బన్: కార్మిక హక్కులను కాలరాసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని టీయూసీఐ ఖమ్మం ఏరియా కమిటీ కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఖమ్మం సాగర్ కాలువపై నిర్వహించిన సమావేశంలో కార్మికుల డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. టీయూసీఐ ఖమ్మం ఏరియా అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రమేష్, ఐరన్, సిమెంట్ హమాలీ సంఘాల నాయకులు రాంబాబు, జి.రాంబాబు, లచ్చయ్య, సైదులు, ఉపేందర్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

మహాగర్జన సభను..

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన పెన్షన్‌ను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 24న ఖమ్మంలో నిర్వహించే దివ్యాంగుల మహాగర్జన సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవింద సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో సభ విజయవంతానికి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. వీహెచ్‌పీఎస్ మహిళ అధ్యక్షురాలు భారతి, భయ్యా ఎల్లయ్య, ఎస్‌డీ సైదాబీ, ఏనుగంటి శైలజ, ఐతరాజు లక్ష్మి, బాలయ్య నాయకులు చింతిరాల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని..

ఖమ్మంమామిళ్లగూడెం: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలపై ఈనెల 29న ఖమ్మంలో జరిగే టీజేఎస్ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ వరదబోయిన బాబు కోరారు. మంగళవారం ఖమ్మంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు జంగిపల్లి రవి, మాదాస్ శ్రీనివాసరావు, లేళ్ల నరసింహారావు, వి.మోహన్, దేవదాసు, రాములు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కామేపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఖమ్మం పార్లమెంట్ సహాయ ఇన్‌చార్జ్ జల్లారపు శ్రీను అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు జర్పుల రామారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడంతోనే స్థానిక ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని తెలిపారు. మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి విమల్ జైన్, గిరిజన రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్యా శ్రీను, పోలూరి రామచంద్రయ్య, వేముల వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు పోరాటాలకు సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ఖమ్మంఅర్బన్: అమెరికాతో స్వేచ్ఛ వ్యవసాయ వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఆ దేశ షరతులకు భారత్ అంగీకరించిందనే కథనాలు రైతులను ఆందోళనలకు గురి చేస్తున్నాయని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు పేర్కొన్నారు. ఖమ్మంలోని ఖానాపురం హవేలీ సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం విధానాలపై రైతులు సంఘటితంగా పోరాడితేనే న్యాయం జరుగుతుందని తెలిపారు. నాయకులు ఎస్.కే.మీరా, బోడేపూడి వీరభద్రరావు, దొంగల తిరుపతిరావు, పిన్నింటి రమ్య, గాలి వెంకటాద్రి, కత్తుల అమరావతి, పోతురాజు వెంకటి, ధనియాకుల నాగేశ్వరరావు, నల్లమల సత్యనారాయణ, మాచర్ల గోపాల్, గాలి అంజయ్య, వేదగిరి మురహరి, కర్ల వీరస్వామి, కుర్రి రవి, రాచకొండ పున్నారావు పాల్గొన్నారు. అనంతరం రైతు సంఘం ఖానాపురం హవేలీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట నాగరాజు, కార్యదర్శిగా జట్లా ఆనందరావుతో పాటు ఇతర పదవులకు పోతురాజు వెంకటి, ధనియాకుల నాగేశ్వరరావు, కుర్రి వెంకటస్వామి, వెంకన్న, కుర్రి రవి ఎన్నికయ్యారు.

పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: నాగార్జున సాగర్ ఎడమ కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి గోవిందరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తి, మొక్కజొన్న, ఇతర మెట్ట పంటలతో పాటు వర్షాల రాకతో వరి నాట్లు కూడా మొదలు కావడంతో యూరియా అవసరం

సంక్షిప్తంగా..

పెరిగినందున ప్రతీ మండలాల్లో ఎక్కువ సంఖ్యలో యూరియా దుకాణాలను ఏర్పాటు చేసి పీఏసీఎస్ ద్వారా విక్రయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మిడికంటి వెంకటరెడ్డి, బానోత్ రాంకోటి తదితరులు పాల్గొన్నారు.


వంట సామగ్రి పంపిణీ

నేలకొండపల్లి: ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన వంట సామగ్రిని ఎంఈఓ బి.చలపతిరావు మండల విద్యా వనరుల కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 58 ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంతు నరేందర్, తొర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల వితరణ

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయానికి కారేపల్లి మండలం విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వల్లభనేని రాఘవయ్య–జోగమ్మ జ్ఞాపకార్థం కుమారుడు శ్రీనివాసరావు సుమారు రూ.20 వేలు విలువైన ఐదు సిమెంట్ బల్లలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల కృష్ణయాదవ్, వెంకటకృష్ణ, శ్రీను, కోటయ్య, వీరనారాయణ, కృష్ణ,వలరాజు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికాసంపై అవగాహన..



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ నాగమణి

ఖమ్మంసహకారనగర్: నగరంలోని శాంతినగర్ ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక వికాసంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ సైకాలజిస్ట్ సరిమల్ల నాగరాణి మాట్లాడుతూ.. విద్యార్థులకు నైతిక విలువల ప్రాముఖ్యత, వ్యక్తిత్వ వికాస సూత్రాలు శరీర మార్పులను అర్థం చేసుకొనుట, విజయ సూత్రాలు వివరించారు.

ఆటో బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

నేలకొండపల్లి: పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ఆటోలో వేగంగా వెళ్తుండడంతో ప్రమాదవశాత్తు బోల్తా పడగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని మండ్రాజుపల్లి నుంచి పుల్లాచారి మంగళవారం రాత్రి ఆటోలో నేలకొండపల్లి వస్తున్నాడు. మధ్యలో కెనాల్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండడంతో భయపడిన ఆయన యూటర్న్ తీసుకుని వేగంగా వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన పుల్లాచారిని ఆస్పత్రిలో చేర్పించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖమ్మం అర్బన్: ఖమ్మం–వైరా ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. రఘునాథపాలెం బైపాస్ వైఎస్సార్ నగర్ వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం ఎస్ఆర్ గార్డెన్స్ సమీపానికి రాగా వైరా నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు.

కారు బోల్తా...

కూసుమంచి: మండలంలోని జీళ్లచెరువు సమీపాన హైవేపై మంగళవారం కారు బోల్తా పడింది. హైదరాబాద్ నుంచి ఖమ్మంకు వెళ్తున్న కారు వేగంగా ప్లాంటేషన్ డివైడర్ మధ్యలో పల్టీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు కాగా ఇతర వాహనదారులు ఖమ్మం తరలించారు.

ఎరువుల ధరలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం డిమాండ్ చేసింది. మంగళవారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆ సంఘ అధ్యక్షుడు మలీదు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ వ్యవసాయ రంగాన్ని దివాళా తీయించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్నాయని మండిపడ్డారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఎరువుల ధరలు పెరిగాయని, ఎరువుల కొరత ఏర్పడిందన్నారు. సొసైటీ ద్వారా నానో యూరియాను అంటగట్టే చర్యలను విరమించుకోవాలన్నారు. రెండవ జూన్ వ్యవసాయానికి సాగర్ జలాలు విడుదల చేయాలని, కారేపల్లి మండలం ఎర్రబోడు పోడు రైతులపై దాడి చేసిన ఫారెస్టు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి కోలేటి నాగేశ్వరరావు, కేశోతు లక్ష్మణ్, కె. నాగేశ్వరరావు, బీరెల్లి లాజర్, గుగులోతు తేజా, పాశం అప్పారావు, నాగిరెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టంలో మార్పులపై చర్చించండి

ఖమ్మంలీగల్: బాధితులకు తక్షణ న్యాయం అందేలా బీఎన్ఎస్ఎస్ చట్టంలో మార్పులు అవసరమని, ఈ మేరకు లోక్‌సభలో చర్చించాలని ఖమ్మంకు చెందిన న్యాయవాదులు తాళ్లూరి దిలీప్, పసుపులేటి శ్రీనివాస్ ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి కోరారు. ఢిల్లీలో మంగళవారం వారు ఎంపీకి వినతిపత్రం అందజేయగా, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పాములు..

నేలకొండపలి: మండలంలోని బీల్యాతండా అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ చెత్త చెదారం, రాళ్లు, మట్టి కుప్పలు పడేయడంతో పాములకు కేంద్రంగా మారింది. రోజు మాదిరిగానే మంగళవారం అంగన్‌వాడీ టీచర్ పార్వతి కేంద్రం తాళాలు తీస్తుండగా గదిలోని ఓ పాము బయటకు వచ్చింది. దీంతో భయంతో టీచర్, చిన్నారులు బయటకు పరుగులు తీశారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిర్మించారు.. వదిలేశారు..

వైకుంఠధామాల్లో కరువైన సౌకర్యాలు

- విద్యుత్ సౌకర్యం లేక వినియోగంలోకి రాని వైనం
- ప్రారంభించకుండానే శిథిలావస్థలోకి..
- శివారు ప్రాంతాల్లో ఉండడంతో నిర్లక్ష్యం






బైరవునిపల్లి వైకుంఠధామంలో పెరిగిన పిచ్చి మొక్కలు (ఇన్‌సెట్) కోరట్లగూడెంలో ధ్వంసమైన గదులు

నేలకొండపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో అంతిమ సంస్కారాలకు ఇబ్బందులు ఉండకూడదని గత ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి వైకుంఠధామాలను నిర్మించింది. వాటిలో విశ్రాంతి, స్నానపు గదులతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్లను ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించడం మరిచారు. కాగా, 2021–22లో జిల్లా వ్యాప్తంగా వైకుంఠధామాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నా.. నేటికి చాలాచోట్ల వినియోగంలోకి రావడం లేదు. ఇదిలా ఉండగా చాలాచోట్ల వైకుఠధామాల నిర్మాణంలో అవకతవకలు జరగడంతో ప్రారంభించకుండానే శిథిలమవుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు శివారు ప్రాంతాల్లో ఉండడంతో పంచాయతీ అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించలేదు. అక్కడక్కడ రోడ్డు పక్కనే ఉన్నా.. మిషన్ భగీరథ పైపులైన్ కూడా వేయడం మరిచారు.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వం పథకాలు పంచాయతీలకు భారంగా మారాయి. పంచాయతీల్లో పైసలు లేక ఎక్కడి వేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా తయారయ్యాయి. జిల్లాలోని నేలకొండపల్లి, తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మం రూరల్, ముదిగొండ, వైరా, మధిర, ఎర్రుపాలెం, రఘునాధపాలెం, తదితర మండలాల్లో వైకుంఠధామాలు నిరుపయోగంగా ఉన్నాయి. పంచాయతీ అధికారులకు బాధ్యత అంటూ విద్యుత్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వెసులుబాటు ఉన్న చోట విద్యుత్, నీటి సరఫరా కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


చర్యలు తీసుకుంటాం..



మండలంలోని వైకుంఠధామాలకు నిర్మాణ సమయంలోనే విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించారు. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే గుర్తించి వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. సౌకర్యాల విషయంలో అన్ని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేస్తాం.


– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

సమగ్ర విచారణ చేపట్టాలి..



వైకుంఠధామ నిర్మాణాల విషయంలో అవకతవకలు జరిగాయని తెలుస్తోంది. ప్రారంభించకుండానే పగుళ్లు ఏర్పడడంతో పక్కా అవినీతి జరిగింది. అధికారులు సమగ్ర విచారణ నిర్వహించి కాంట్రాక్టర్ నుంచి నిధులు రికవరీ చేయాలి. లేకుంటే ఉద్యమం చేస్తాం. – మారిశెట్టి వెంకటేశ్వరరావు, సీపీఐ మండల కార్యదర్శి

పట్టించుకోని ప్రభుత్వం..



వైకుంఠధామాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. గత ప్రభుత్వం అంతిమ యాత్రకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దని ప్రతీ గ్రామంలో వీటిని నిర్మించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదు. ఇకనైనా అన్ని సౌకార్యలు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలి.

– కమదన ప్రవీణ్, యువజన సంఘం ప్రతినిధి